సాక్షి ఖమ్మం

సోమవారం । 26 । జూన్ । 2023



బడి బాటన విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 8లో



క్రీడా స్ఫూర్తి చాటాలి

విద్యుత్ ఉద్యోగులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని, పోటీతత్వం ఎంతో అవసరమని జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు అన్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
30° / 26°

వాతావరణం

జిల్లాలో సోమవారం వాతావరణం చల్లబడి ఉంటుంది. అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఐదుగురు తహసీల్దార్ల బదిలీ

ఖమ్మంసహకారనగర్ : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం కలెక్టరేట్ ఏఓగా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాసరావును ఆర్డీఓ కార్యాలయ ఏఓగా, అక్కడి ఏఓ డి.జగదీశ్వరప్రసాద్‌ను వైరా తహసీల్దార్‌గా, కల్లూరు ఆర్డీఓ కార్యాలయ ఏఓ వి.వి. శకుంతలను కూసుమంచి తహసీల్దార్‌గా, వైరా తహశీల్దార్ ఎస్.అరుణ, కూసుమంచి తహసీల్దార్ కేవీఎంఏ మీనన్‌ను కలెక్టరేట్ సూపరింటెండెంట్లుగా బదిలీ చేశారు. వీరంతా త్వరలో విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భద్రాద్రి నుంచి సరిహద్దు రాష్ట్రాలకు సేవలు

ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్



రామాలయంలో బాజిరెడ్డి గోవర్ధన్ తదితరులు

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్య క్షేత్రమైన భద్రాచలం నుంచి సరిహద్దు రాష్ట్రాలతోపాటు మెట్రో నగరాలకు టీఎస్ ఆర్టీసీ సేవలు విస్తరింపజేస్తామని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. భద్రాచలం ఆర్టీసీ డిపో, బస్టాండ్లను ఆదివారం ఆయన పరిశీలించి మొక్కలు నాటారు. అంతకుముందు శ్రీసీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఆర్టీసీకి ఆదాయం వచ్చే ప్రతి మార్గాన్నీ వదులుకోకుండా సంస్థ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా చర్యలు చేపడతామని చెప్పారు. భద్రాచలం డిపో నుంచి ప్రత్యేక డీలక్స్ బస్సులను మెట్రో నగరాలకు నడిపేలా ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు. మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న భద్రాచలం బస్టాండ్‌లో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల పీఆర్‌సీ అమలుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం భవానీ ప్రసాద్, డిపో మేనేజర్ బి.రామారావు, కొత్తగూడెం డీఎం బి. వెంకటేశ్వరరావు, సీఐలు శ్రీనివాసరావు, గౌతమి పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయకులు

ఖమ్మంగాంధీచౌక్: స్వర సుధ మ్యూజిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన 'రంగులలో కళవో' సినీ సంగీత విభావరి అలరించింది. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పారుపల్లి సురేష్, అధ్యక్షుడు కొమర్రాజు మాధవరావు, ముఖ్య సలహాదారు వనం కృష్ణవేణి, ప్రముఖ రంగస్థల కళాకారులు పొదిలి వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత దివంగత గాయకుడు ఘంటసాల చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ప్రముఖ గాయకులు రేవతి, పి శివలీల, డి ప్రియాంక, ఎస్.నాగస్వర్ణశ్రీ, ఎస్వీ రమణ, ఎ.గజపతి రాజు, ఎం. ఇశ్రాయేలు, పున్నయ్య, ఎండీ జాఫర్ మధుర గీతాలను ఆలపించారు. కమెడియన్ మొగిలి గుణకర్ హాస్యాన్ని పండించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు వీవీ రెడ్డి, శీలం పాపారావు, నెలనెల వెన్నెల ప్రతినిధులు ఏఎస్ కుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు, కొదుమూరి లక్ష్మణమూర్తి, పీజే వినమ్‌కుమార్ పాల్గొన్నారు.

బోనమెత్తిన ఇల్లెందు ఎమ్మెల్యే



బోనమెత్తుకుని వస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: మండలంలోని చింతలంక పంచాయతీ రాజుతండాలో ఆషాఢమాసంలో భాగంగా ఆదివారం ముత్యాలమ్మకు ఘనంగా బోనాలు సమర్పించారు. ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ బోనమెత్తుకుని ఊరేగింపులో పాల్గొనగా, స్థానిక మహిళలు బంజారా వేషధారణలో స్వాగతం పలికారు. సర్పంచ్ భూక్యా రతన్‌లాల్ పాల్గొన్నారు.

సాయానికి వేళాయె..



నేటి నుంచి రైతుబంధు నగదు జమ

- వానాకాలం సీజన్‌లో 3,32,893 మంది అర్హులు
- జిల్లాకు రూ.364.23 కోట్లు కేటాయింపు
- కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన 15,969 మందికీ అవకాశం

ఖమ్మంవ్యవసాయం: వానాకాలం రైతుబంధు పథకం సోమవారం నుంచి అమలు కానుంది. ఈ పథకానికి గుర్తించిన అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో ఎకరాకు రూ.5వేల చొప్పున పెట్టుబడి సాయం జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో 3,32,893 మంది రైతులను అర్హులుగా గుర్తించింది. ఎకరాకు రూ. 5వేల చొప్పున జిల్లాకు రూ.364.23 కోట్లు కేటాయించింది. గతంలో మాదిరిగానే తక్కువ భూమి గల రైతులకు ప్రాధాన్యం ఇస్తూ వారి బ్యాంకు ఖాతాల్లో రైతుబంధు సాయం జమ చేయనున్నారు. జిల్లాలో ఎకరం లోపు భూమి గల 1.10 లక్షల మంది రైతులకు సోమవారం ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఆ తర్వాత ప్రాధాన్యతా క్రమంలో రెండు, మూడు, ఐదెకరాలు, ఆపైన ఉన్న రైతులకు పెట్టుబడి సాయం అందనుంది.

కొత్తగా 15,969 మందికి..

జూన్ 18వ తేదీ వరకు పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన మరో 15,969 మంది రైతులకు కూడా రైతుబంధు పథకంలో ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆయా రైతులకు ఉన్న భూమి ఆధారంగా ఎకరాకు రూ.5వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కానుంది. ఆయా రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్ కాపీలను సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారులకు అందించాల్సి ఉంటుంది. ఏఈఓలు రైతుల వివరాలను రైతుబంధు పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇక గతంలో బ్యాంక్ ఖాతాల్లో తప్పులు దొర్లిన, ఐఎఫ్ఎస్సీ కోడ్ తప్పుగా ఉండి రైతుబంధు సాయం పొందలేని వారు కూడా ఆ వివరాలను వ్యవసాయ విస్తరణాధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేసుకోవాల్సి ఉంటుంది.



గత ఏడాది కంటే పెరిగిన అర్హులు..

గత ఏడాది వానాకాలం, యాసంగి సీజన్‌లతో పోలిస్తే ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో రైతుబంధు లబ్ధిదారుల సంఖ్య పెరిగింది. గతేడాది వానాకాలంలో 3,23,310 మంది రైతులను ఈ పథకానికి అర్హులుగా గుర్తించగా వారికి ఉన్న భూమి ఆధారంగా రూ.362.29 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. దీంతో పాటు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన వారు మరో 13,418 మందికి ఈ పథకం వర్తించింది. యాసంగి సీజన్‌లో 3,28,491 మంది రైతులను పథకానికి అర్హులుగా గుర్తించగా రూ.363.44 కోట్లు జిల్లాకు విడుదలయ్యాయి. దీంతో పాటు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన మరో 8,556 మంది రైతులకు కూడా ఈ పథకంలో అవకాశం కలిగింది. ఆ రెండు సీజన్లతో పోలిస్తే ప్రస్తుత వానాకాలంలో రైతుబంధు పథకంలో అర్హుల సంఖ్య, నిధుల కేటాయింపు పెరిగాయి. గత వానాకాలం సీజన్ కంటే ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 13,418 మంది లబ్ధిదారులు అదనంగా పెరగగా, నిధులు మరో రూ. 98.06 లక్షలు అధికమయ్యాయి. వీరితో పాటు ఈనెల 18వరకు పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన 15,969 మందిని కూడా కలిపితే ఆ సంఖ్య 29,387కు చేరనుంది. అయితే ఈ 15,969 మందికి సంబంధించి ఎంత మేర నిధులు విడుదలవుతాయనేది వారి భూమిని పట్టి ఉంటుందని అధికారులు అంటున్నారు.

ప్రతీ 15న ఆర్థిక సాయం

- బీసీ రుణాలకు లబ్ధిదారుల ఇంటి వద్దే దరఖాస్తుల పరిశీలన
- ఎవరికీ ధ్రువపత్రాలు ఇవ్వాల్సిన అవసరం లేదు
- ప్రభుత్వం ఎంపిక చేసిన కులాలకే తొలి ప్రాధాన్యం
- మంజూరైన వారు పక్కాగా యూనిట్ ఏర్పాటు చేయాల్సిందే
- 'సాక్షి'తో డీబీసీడీడీ జి.జ్యోతి

సాక్షి INTERVIEW



మాట్లాడుతున్న జ్యోతి

ఖమ్మంమయూరిసెంటర్: 'బీసీల్లోని అత్యంత వెనుకబడిన తరగతులకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం అందించేందుకు ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 6 నుంచి 20 వరకు ఆన్‌లైన్.ద్వారా దరఖాస్తులు తీసుకోగా.. 22 నుంచి మండలాల్లో ఎంపీడీఓలు, మున్సిపాలిటీల్లో కమిషనర్ల ఆధ్వర్యంలో పరిశీలన ప్రారంభమైంది. ఎంపీడీఓలు, కమిషనర్లు పంపించిన నివేదిక ప్రకారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారులను ఎంపిక చేసి విడతల వారీగా ప్రతినెలా 15న ఆర్థిక సాయం నిధులను మంజూరు చేస్తాం' అని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.జ్యోతి తెలిపారు. ఆదివారం ఆమె 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆమె మాటల్లోనే..

ధ్రువపత్రాలు ఇవ్వక్కర్లేదు..

ఆర్థిక సాయం కోసం లబ్ధిదారుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించాం. మండల అధికారులు, మున్సిపల్ అధికారులు ఆయా దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే ఓపెన్ చేసి ఆ జాబితా తీసుకుంటారు. జాబితా ప్రకారం మండల అధికారులు, మున్సిపల్ అధికారులు లబ్ధిదారుల ఇంటికి నేరుగా వెళ్లి అక్కడే దరఖాస్తులను పరిశీలించి వివరాలు తెలుసుకుంటారు. లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులు, వాటికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలను ఏ కార్యాలయంలో ఇవ్వాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్‌లో నమోదైన ప్రతి దరఖాస్తును పరిశీలిస్తారు. 78 కులాలకు చెందిన వారి నుంచి దరఖాస్తులు వచ్చాయి.

తొలి ప్రాధాన్యత వారికే..

ఆర్థిక సాయం కోసం ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించగానే బీసీ కులాలకు చెందిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అందరి అప్లికేషన్లను పరిశీలించి కులాల వారీగా జాబితా తయారు చేసి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషన్లు, డీబీసీడీడీకి పంపిస్తారు. వాటిని కార్యాలయంలో పరిశీలిస్తాం. గతంలో ఎవరైనా రుణాల లబ్ధి పొంది ఉంటే వారికి ఈ సాయం అందదు. తొలి ప్రాధాన్యత ప్రభుత్వం ప్రకటించిన ఎంబీసీల్లోని 15 కులాలకు ఉంటుంది. వీరందరికీ సాయం అందించిన తర్వాత బడ్జెట్ మిగిలితే ప్రభుత్వ సూచనల మేరకు మంజూరు చేస్తాం.

జిల్లా కమిటీ పరిధిలో ఎంపిక..

ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, డీబీసీడీడీ కార్యాలయంలో లబ్ధిదారుల జాబితా పరిశీలన అనంతరం కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కమిటీకి పంపిస్తారు. కలెక్టర్, అదనపు కలెక్టర్, డీబీసీడీడీ, డీఆర్డీఏ పీడీలతో ఏర్పాటు చేసిన కమిటీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హుల జాబితాను ఎంపిక చేస్తుంది. జిల్లాకు కేటాయించిన బడ్జెట్ ప్రకారం ప్రతినెలా 15న కొంతమందికి ఈ సాయం అందజేస్తాం. యూనిట్ల ఎంపిక కోసం లబ్ధిదారులు దళారులను ఆశ్రయించొద్దు. అర్హులైతే ఏ సిఫార్సు లేకుండానే యూనిట్ అందుతుంది.

మూడు నెలలకోసారి..

ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పొందిన లబ్ధిదారుడు రెండు నెలల్లో సామగ్రి కొనుగోలు చేసి యూనిట్ నెలకొల్పాలి. సాయం పొందిన రెండు నెలల తర్వాత మండల అభివృద్ధి అధికారి, ఆ మండల ప్రత్యేక అధికారి లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి యూనిట్‌ను పరిశీలించి యూసీలు తీసుకుంటారు. తర్వాత ప్రతి మూడు నెలలకు ఒకసారి మూడు సంవత్సరాల పాటు లబ్ధిదారుడి వద్ద గల యూనిట్‌ను అధికారులు పరిశీలిస్తారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



ప్రదర్శన నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, యూటీఎఫ్ నాయకులు

ఖమ్మం సహకారనగర్ : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సత్వరమే నోటిఫికేషన్ విడుదల చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక డీపీఆర్‌సీ భవనంలో జిల్లాలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆదివారం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల ఖాళీలను తాత్కాలిక ఉపాధ్యాయులతో తక్షణమే భర్తీ చేయాలన్నారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య పనుల బాధ్యతను పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్లు తీసుకోవాలని చెప్పినా చాలాచోట్ల సక్రమంగా అమలు కావడం లేదని, దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పారిశుద్ధ్య సిబ్బందిని విద్యాశాఖ నుంచే నియమించాలని కోరారు. పాఠశాల గ్రాంట్స్‌ను ఖర్చులకు అనుగుణంగా పెంచి సత్వరమే విడుదల చేయాలన్నారు. మన ఊరు - మన బడి పాఠశాల పనులను వెంటనే పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని అన్నారు. అంతకుముందు నగరంలో ఉపాధ్యాయులు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ నాయకులు దుర్గాభవాని, షేక్ మహబూబ్ అలీ, బండి నరసింహారావు, జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, బుర్రి వెంకన్న, షేక్ రంజాన్, బి.రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల తనిఖీ ప్రారంభం



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్లు స్నేహలత, మధుసూదన్ తదితరులు

ఖమ్మం సహకారనగర్ : ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ(ఫస్ట్ లెవల్ చెకప్)ను ఆదివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం జెడ్పీ కార్యాలయ ఆవరణలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీ ప్యాట్)లను తనిఖీ చేశామని చెప్పారు. ఈవీఎం, వీవీప్యాట్‌లను ప్రతి ఎన్నికల ముందు ఆయా పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ఖరారు చేయడానికి ముందు మొదటి స్థాయి తనిఖీ పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏసీపీ టి.రవి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు మదన్‌గోపాల్, రాంబాబు, బీఆర్ఎస్, బీఎస్పీ, బీజేపీ, ఆప్, కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ, సీపీఎం పార్టీల ప్రతినిధులు కమర్తపు మురళి, ఎం.సుభాష్‌చంద్రబోస్, జీఎస్ఆర్‌పీ విద్యాసాగర్, పసుమర్తి శ్రీనివాస్, బి.సైదేశ్వర్ రావు, వి.భిక్షపతి, తాటి వెంకటేశ్వర రావు, ఆర్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసానికి 'మనవడికో లేఖ'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

ఖమ్మంగాంధీచౌక్: సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి వురిమళ్ల సునంద రాసిన 'మనవడికో లేఖ' దోహదం చేస్తుందని ప్రముఖ కవి మువ్వా శ్రీనివాసరావు తెలిపారు. వురిమళ్ల ఫౌండేషన్, అక్షరాల తోవ సాహిత్య సంస్థ సయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలోని రిక్కాబజార్ ఉన్నత పాఠశాలలో 'మనవడికో లేఖ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అమెరికాలో ఉంటున్న మనవడికి ఖమ్మంలో ఉన్న అమ్మమ్మ రాసిన లేఖలు తనకొక్కడికే గాకుండా అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. బాలల్లో సృజనాత్మకతకు, చైతన్య స్ఫూర్తికి సునంద రచనలు దోహదపడుతున్నాయని కొనియాడారు. కార్యక్రమంలో బాల సాహితీ వేదిక కన్వీనర్ కోంద్రు బ్రహ్మం, అక్షరాల తోవ నిర్వాహకులు నామా పురుషోత్తం, సాహితీవేత్తలు కన్నెగంటి వెంకటయ్య, సయ్యద్ షఫీ, పోతగాని సత్యనారాయణ, సుచరిత, దారోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్ పాల్గొన్నారు.

నేడు మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

ఖమ్మంగాంధీచౌక్: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం 7 గంటలకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియం నుంచి లకారం ట్యాంక్ బండ్ వరకు నిర్వహించే మార్నింగ్ వాక్‌ను విజయవంతం చేయాలని జిల్లా సంక్షేమాధికారి జి. జ్యోతి కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పలితాలు, అక్రమ రవాణా వంటి అంశాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్నింగ్ వాక్ అనంతరం అవగాహన కార్యక్రమం ఉంటుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం అంతరాలయంలోని మూలమూర్తులకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. అనంతరం నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

సలహాల బాక్సులు ఏర్పాటు

ఆలయ ఈఓ ఎల్.రమాదేవి ఆధ్వర్యంలో భక్తుల వసతులు మెరుగుపర్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఆలయంలో జరిగే ఆర్జిత సేవలు, అందే వసతులను గురించి తెలిపేలా రాజగోపురం ఎదురుగా ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. భక్తుల నుంచి సలహాలు, ఫిర్యాదులను స్వీకరించేందుకు టికెట్ల విక్రయ కౌంటర్ల వద్ద ప్రత్యేక బాక్సులను ఏర్పాటు చేశారు.

డ్రైవరన్నా.. చలో సిరిసిల్ల..!

- హెవీ లైసెన్స్ రెన్యూవల్ కావాలంటే తప్పనిసరి
- అక్కడకు వెళ్తేనే టీఐడీఈఎస్ సర్టిఫికెట్.. ఆపై స్లాట్ బుకింగ్
- సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- దూరాభారం కావడంతో ఇబ్బంది పడుతున్న డ్రైవర్లు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే సుమారు 20 వేల మంది...

సత్తుపల్లి: హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన డ్రైవర్లు రెన్యూవల్ చేసుకోవడం భారమవుతోంది. గతంలో ఎక్కడికక్కడ రవాణా శాఖ కార్యాలయంలో లైసెన్స్ రెన్యూవల్ చేసేవారు. కానీ గత మే నెల నుంచి రెన్యూవల్ స్లాట్ బుక్ చేసుకోవాలంటే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్(టీఐడీఈఎస్)ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఇంతవరకూ బాగానే ఉన్నా ఈ సర్టిఫికెట్ జారీకి శిక్షణ కేంద్రం రాష్ట్రం మొత్తం మీద రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మాత్రమే ఉంది. దీంతో కనీసం రెండు రోజులు కేటాయిస్తే తప్ప అక్కడకు వెళ్లి వచ్చే పరిస్థితి లేకపోవడంతో డ్రైవర్లు వ్యయప్రయాసలకు లోనవుతున్నారు.



సిరిసిల్లలోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్

రాష్ట్రమంతటా ఒకటే ట్రాక్

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఇరవై ఎకరాల విస్తీర్ణంలో తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్(టీఐడీఈఎస్)ను ఏర్పాటుచేశారు. ఇక్కడ ఇంటర్నేషనల్ డ్రైవింగ్ ట్రాక్ నిర్మించటంతో డ్రైవర్‌కు ఒకరోజు జాతీయ, రాష్ట్రీయ రహదారులపై డ్రైవింగ్‌లో మెళకువలు, సిగ్నలింగ్ సిస్టమ్‌పై శిక్షణ ఇస్తారు. ఆన్‌లైన్ తరగతుల ద్వారా జాతీయ రహదారిపై ఎంత వేగంగా వాహనం నడపాలో వివరించి టీఐడీఈఎస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఈ సర్టిఫికెట్ ఉంటేనే హెవీ డ్రైవింగ్ లైసెన్సు రెన్యూవల్ చేసుకునేందుకు స్లాట్ బుక్ చేసుకునే అవకాశం లభిస్తుంది. గతంలో దీనిని పెద్దగా పరిగణనలోకి తీసుకోకున్నా ఈ ఏడాది మే నెల నుంచి ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీంతో రాష్ట్రమంతటా హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు తప్పనిసరిగా సిరిసిల్ల వెళ్లాల్సి వస్తోంది. వాస్తవానికి ఇది మంచి కార్యక్రమనే ప్రశంసలు వస్తున్నా.. దూరం కావటం వల్లే డ్రైవర్ల నుంచి వ్యతిరేకత వస్తోంది. కాగా, కొత్త హెవీ లైసెన్సులు మాత్రం ఎక్కడికక్కడ ఎంవీఐ కార్యాలయాల్లోనే జారీ చేస్తున్నారు.

సిరిసిల్ల వెళ్లాలంటే..

రాష్ట్రవ్యాప్తంగా డ్రైవర్లు టీఐడీఈఎస్ సర్టిఫికెట్ కోసం సిరిసిల్ల వెళ్లాల్సి రావడం దూరాభారమేనని చెప్పాలి. ఉమ్మడి ఖమ్మం జిల్లా డ్రైవర్లను తీసుకుంటే సరైన రవాణా సౌకర్యం లేక ఒక రైలు, ఒక బస్సు లేదంటే రెండు బస్సులు మారాల్సి ఉంటుంది. దీనికి తోడు ఆ ప్రాంతం కొత్తది కావటంతో డ్రైవర్లు ఇబ్బంది పడుతుండగా.. కనీసం రూ.3 వేలకు పైగా వ్యయమవుతోంది. ఇక సిరిసిల్ల ట్రాక్ వద్ద రోజుకు కేవలం 300 మందికి మాత్రమే శిక్షణ ఇచ్చే అవకాశం ఉండడంతో డ్రైవర్లు అక్కడికి వెళ్లాక ఎప్పుడు పిలుస్తారో తెలియక పడిగాపులు పడాల్సి వస్తోంది.

మినహాయింపు ఇవ్వండి..

రెండు, మూడు జిల్లాలు కలిపి వంద కిలోమీటర్ల పరిధిలో ఎక్కడికక్కడ ఇంటర్నేషనల్ డ్రైవింగ్ ట్రాక్‌ను నిర్మిస్తే తమకు అందుబాటులో ఉంటుందని డ్రైవర్లు అంటున్నారు. సిరిసిల్ల దూరాభారం కావడంతో కొత్తగా మరిన్ని డ్రైవింగ్ ట్రాక్‌లు అందుబాటులోకి వచ్చే వరకు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్‌కు టీఐడీఈఎస్ సరిఫికెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డ్రైవర్లు, లారీ యజమానుల నుంచి డిమాండ్ వస్తోంది. కాగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగిన వారు సుమారు 20వేల మంది ఉంటారనేది అంచనా.

డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు..



సత్తుపల్లి నుంచి సిరిసిల్లకు వెళ్లాలంటే కనీసం రానుపోను రెండురోజులు పడుతుంది. ఖర్చు రూ.5వేల వరకు వస్తుంది. దీంతో డ్రైవర్లు హెవీ లైసెన్స్ రెన్యూవల్‌కు వెళ్లడానికి వెనుకాడుతున్నారు. రెన్యూవల్ చేయించుకోకుండా ఏదైనా జరగరానిది జరిగితే యజమానితో సహా బాధితులు కూడా నష్టపోవాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వం పునరాలోచన చేసి పాత పద్ధతిలోనే రెన్యూవల్‌కు అవకాశం ఇవ్వాలి.

– కొండపల్లి రమేష్‌రెడ్డి, లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు, సత్తుపల్లి

ఇది ప్రభుత్వ పాలసీ..



సిరిసిల్లలో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ ట్రాక్ ఉండటం వల్ల హెవీ డ్రైవింగ్ రెన్యూవల్ లైసెన్సు హోల్డర్‌కు మంచి శిక్షణ ఉంటుంది. జాతీయ, అంతర్జాతీయ రహదారుల ప్రమాణాలు, వేగం, సిగ్నలింగ్ వ్యవస్థపై సంపూర్ణ అవగాహన కల్పిస్తారు. ఇక టీఐడీఈఎస్ సర్టిఫికెట్ అనేది ప్రభుత్వ పాలసీ. డ్రైవర్లకు మేలు జరిగేది కావడం, ట్రాక్ సిరిసిల్లలోనే ఉండడంతో డ్రైవర్లను అక్కడకు పంపించాల్సి వస్తోంది.

– దారా మనోహర్, ఎంవీఐ, సత్తుపల్లి

బడి బాటన విద్యార్థులు



కొణిజర్ల మండలం తనికెళ్లలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

- ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా 8,782 మంది విద్యార్థుల చేరిక
- నేటి నుంచి వచ్చేనెల 6 వరకు బడిబాట పెంపు

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఏటా పాఠశాలలు పునఃప్రారంభం సమయంలో బడిబాట కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. ఈ ఏడాది జూన్ 2 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 1,235 పాఠశాలలు ఉండగా.. వాటిలో 8,782 మంది విద్యార్థులు చేరారని అధికారులు తెలిపారు.

ప్రవేశాలు ఇలా..

ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించింది. కనీస సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తుండగా ఈ ఏడాది 8,782 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. 1,213 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. వాటిలో 813 పాఠశాలల్లో విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఇందులో ప్రీప్రైమరీ నుంచి 162 మంది విద్యార్థులు, 1వ తరగతిలోకి అంగన్‌వాడీల నుంచి 3,288 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 275, నేరుగా 284 మంది చేరగా.. 2 నుంచి 12వ తరగతి వరకు 2,330 మంది విద్యార్థులు చేరినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రైవేట్ పాఠశాలల నుంచి 2,605 మంది విద్యార్థులు చేరటం గమనార్హం.

సౌకర్యాలతోనే పెంపు

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేస్తుండటంతో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెరుగుతున్నట్లుగా ఉపాధ్యాయులు చెబుతున్నారు. మన ఊరు – మన బడి, మనబస్తీ – మన బడి కార్యక్రమాలు ఎంతో సత్ఫలితాలిచ్చాయని, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజన పథకాలతో పాటు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు కల్పించడంతో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొంటున్నారు. ఈ నెల 3 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో చేపట్టిన కార్యక్రమాల మూలంగా విద్యార్థుల సంఖ్య పెరిగిందని వారు అభిప్రాయపడుతున్నారు.

పాఠశాలల వివరాలు	
మండలాలు	21
పాఠశాలలు	1,235
బడిబాటలో అడ్మిషన్లు	8,782
1వ తరగతికి మొత్తం అడ్మిషన్లు	3,847
2 నుంచి పదో తరగతి వరకు	2,330
మొత్తంగా ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలలకు	2,605

బడిబాట పెంపు

రాష్ట్ర ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని మరికొన్ని రోజులు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 26(నేటి) నుంచి జూలై (వచ్చే నెల) 6వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తూ యథావిధిగా పాఠశాల సమయంలో విద్యాబోధన సాగించాలని ప్రభుత్వం సూచించింది. తక్కువ విద్యార్థులున్న పాఠశాలలను గుర్తించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థుల సంఖ్యను పెంచేలా చూడాలని పేర్కొంది.

ప్రవేశాలు పెంచుతాం



బడిబాట కార్యక్రమాన్ని జూలై 6వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్న క్రమంలో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచేలా చర్యలు తీసుకుంటాం. ఆ దిశగా ఇప్పటికే ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు సూచనలు చేశాం.
– సోమశేఖర శర్మ, జిల్లా విద్యాశాఖాధికారి, ఖమ్మం

క్లుప్తంగా

విహారయాత్రకు 'తలసేమియా' విద్యార్థులు



ఎయిర్‌పోర్ట్‌లో తలసేమియా చిన్నారులు

ఖమ్మంవైద్యవిభాగం: ఓ వైపు తలసేమియాతో బాధపడుతూనే పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులను సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విమానం ఎక్కించి విహారయాత్రకు తీసుకెళ్తున్నట్లు ఆ సంస్థ కోశాధికారి ప్రొద్దుటూరి రవిచంద్ర తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి వార్షిక పరీక్షలు రాసి ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులైన ముగ్గురు చిన్నారులను ఆదివారం హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు విమానంలో తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలసేమియా చిన్నారులను పాఠశాలలకు పంపించేందుకు తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారని, వారిలో భయాన్ని తొలగిస్తూ, చిన్నారులను విద్యలో ప్రోత్సహించేందుకు విహారయాత్రకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఏటా పదిలో మంచి మార్కులు తెచ్చుకున్నవారిని విహారయాత్రకు తీసుకెళ్తామని హామీ ఇచ్చామని, ఈ ఏడాది శ్రీలక్ష్మి, మన్విత, చరణ్‌ను తీసుకెళ్లామని వివరించారు. కార్యక్రమంలో పి.అనిత పాల్గొన్నారు.

హెచ్ఆర్సీ ప్రధాన కార్యదర్శిగా పుల్లంరాజు



నియామక పత్రం అందుకుంటున్న పుల్లంరాజు

ఖమ్మంఅర్బన్: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఖమ్మం నగరానికి చెందిన టీవీ పుల్లంరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో పుల్లంరాజుకు నియామక పత్రం అందజేశారు. న్యాయ సలహాదారుగా కూడా ఖమ్మానికే చెందిన తౌఫిక్ అహ్మద్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పుల్లంరాజు, తౌఫిక్ మాట్లాడుతూ.. తమను ఈ పదవుల్లో నియమించిన జాతీయ, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వినాయకపురంలో చోరీ

నగదు, బంగారు ఆభరణాలు అపహరణ

అశ్వారావుపేటరూరల్: ఒకే ఇంట్లో ఉన్న రెండు వేర్వేరు పోర్షన్లలో చోరీ జరిగిన సంఘటన మండలంలోని వినాయకపురం గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన ఎస్.కే. గఫూర్, అశ్వారావుపేటకు చెందిన జల్లి శ్రీనివాసరావు అనే వ్యక్తులు ఒకే ఇంట్లో ఉన్న రెండు వేర్వేరు పోర్షన్లలో అద్దెకు ఉంటున్నారు. ఇరువురు సాయంత్రం వేర్వేరుగా పనిపై అశ్వారావుపేటకు వచ్చి, తిరిగి వెళ్లేసరికి రెండు పోర్షన్ల తలుపుల తాళాలు ధ్వంసం చేసి కనిపించాయి. దీంతో లోపలి వెళ్లి చూడగా శ్రీనివాసరావు ఇంట్లో బీరువాలో ఉన్న రూ.10వేల నగదు, రూ.50వేల విలువ చేసే బంగారు, వెండి అభరణాలు, అలాగే గఫూర్ ఇంట్లో బీరువాలో ఉన్న రూ.50వేల విలువగల బంగారు, వెండి అభరణాలు గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. ఈ చోరీ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. చోరీ ఘటనలపై తమకు బాధితుల నుంచి ఫిర్యాదులు రాలేదని స్థానిక ఎస్సై బి.రాజేశ్‌కుమార్ తెలిపారు.

కొదుమూరు ఆలయంలో...



ఆలయంలో పగులగొట్టిన హుండీలు

చింతకాని: మండలంలోని కొదుమూరు గ్రామంలోని చెరువుకట్టపై ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు ఆలయంలోకి ప్రవేశించి రెండు హుండీలను పగొలగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. ఆలయ గర్భగుడి తాళాలను పగులగొట్టి అమ్మవారి మంగళ సూత్రాలను కూడా అపహరించారు. ఆదివారం తెల్లవారుజామున ఆలయాన్ని శుభ్రం చేసేందుకు వచ్చిన స్వీపర్ బొలగాని సత్యం జరిగిన విషయాన్ని కమిటీ సభ్యులకు చెప్పాడు. వారు వచ్చి పరిశీలించిన అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోరెన్సిక్ నిపుణులు వచ్చి వేలిముద్రలను సేకరించారు. రెండు హుండీల్లో సుమారు రూ.20 వేల నగదు ఉంటుందని, మంగళ సూత్రాల విలువ రూ.40 వేలు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఫారెస్ట్ ఆఫీసర్‌ను దూషించిన వ్యక్తిపై కేసు

పాల్వంచ: ఫారెస్ట్ ఆఫీసర్‌ను దూషించిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని గుడిపాడు గ్రామంలో పూనెం ప్రశాంత్ అనే వ్యక్తి ఇంటి వద్ద కర్రలు ఉండడంతో వాటి గురించి ప్రశ్నించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉమాదేవిని ప్రశాంత్ దుర్భాషలాడాడు. ఈమేరకు బీట్ ఆఫీసర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

సత్తుపల్లికి రూ.50 కోట్లు ఎస్‌డీఎఫ్ నిధులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

- వచ్చే నెలలో నలుగురు మంత్రుల రాక
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గానికి ముఖ్యమంత్రి కేసీఆర్ 818 పనులకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి రూ.50 కోట్లు మంజూరు చేసినట్లు సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వెల్లడించారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ కేటగిరిలో 148 అభివృద్ధి పనులకు రూ.7 కోట్లు, ఎస్టీ కేటగిరిలో 78 పనులకు రూ.3.53 కోట్లు, బీసీ, ఓసీ, మైనార్టీల కేటగిరిలో 592 పనులకు రూ.39.47 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. వాటిలో సత్తుపల్లి మండలానికి రూ.9.5 కోట్లు, పెనుబల్లి మండలానికి రూ.10.5 కోట్లు, వేంసూరు మండలానికి రూ.7.73 కోట్లు, కల్లూరు మండలానికి రూ.12.77 కోట్లు, తల్లాడ మండలానికి రూ.5.86 కోట్లు, మున్సిపాల్టీకి రూ.1.85 కోట్లు, నీలాద్రి ఆలయానికి రూ.50 లక్షలు, తాళ్లమడ ఆలయానికి రూ.35 లక్షలు, సమీకృత కలెక్టరేట్ అభివృద్ధి పనులకు అందరి ఎమ్మెల్యేల భాగస్వామ్యం ఉండాలని రూ.కోటి కేటాయించినట్లు తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వచ్చే నెల మొదటి వారంలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మహమూద్ అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి రానున్నట్లు చెప్పారు.

త్రీమెన్ కమిటీ..

సత్తుపల్లిలోని సింగరేణి బ్లాస్టింగ్ బాధితుల సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లామని, దీనిపై సీఎండీ శ్రీధర్‌కు త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారని తెలిపారు. బాధితులను ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్‌తోపాటు దొడ్డా హైమావతి, లక్కినేని అలేఖ్య, పగుట్ల వెంకటేశ్వరరావు, భూపాల్‌రెడ్డి, కూసంపూడి రామారావు, చల్లగుండ్ల కృష్ణయ్య, వనమా వాసు, ఎస్‌కె రఫీ, కనగాల వెంకట్రావ్, అశోక్ పాల్గొన్నారు.

పీపుల్స్‌మార్చ్ ముగింపు సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సంభాని, దుర్గాప్రసాద్ తదితరులు

మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్

ఖమ్మంసహకారనగర్: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క నిర్వహిస్తున్న పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర ముగింపు సభను జయప్రదం చేయాలని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కోరారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వచ్చే నెలలో జరిగే పీపుల్స్‌మార్చ్ బహిరంగ సభకు ఏఐసీసీ నాయకులు రాహుల్‌గాంధీ హాజరవుతారని, భట్టి పాదయాత్ర సూర్యాపేట జిల్లా నుంచి ఈ నెల 28వ తేదీన నాయకన్‌గూడెం, కూసుమంచి, జీళ్లచెర్వు మీదుగా ఖమ్మంకు చేరుకుంటుందని తెలిపారు. పొన్నెకల్లు సమీపంలో పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పీపుల్స్‌మార్చ్ పైలాన్‌ను ఆవిష్కరిస్తారని చెప్పారు. అనంతరం పార్టీ నగర అధ్యక్షుడు మహమ్మద్ జావేద్ మాట్లాడారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నాయకులు రాయల నాగేశ్వరరావు, మాలోత్ రాందాస్‌నాయక్, దొబ్బల సౌజన్య, యడ్లపల్లి సంతోష్, సయ్యద్ ముజాహిద్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన ప్రదాతకు సముచిత స్థానం

నుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్



మాట్లాడుతున్న నుడా చైర్మన్ విజయ్‌కుమార్

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం జిల్లా జ్ఞాన ప్రదాత గెంటాల నారాయణరావు విగ్రహం ఏర్పాటు, కళాశాల అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వం కీలక భూమిక పోషిస్తోందని నుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పూర్వవిద్యార్థుల కన్వీనర్ నల్లమోతు తిరుమల్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి కోసం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రూ.15 లక్షలు మంజూరు చేశారన్నారు. ఇల్లెందు రోడ్డుకు గెంటాల నారాయణరావు పేరు పెట్టాలని చేసిన తీర్మానం అమలుతో పాటు ఆయన కాంస్య విగ్రహానికి అయ్యే ఖర్చులో సగం భరిస్తామని హామీ ఇచ్చారు. కళాశాలను యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాలనే డిమాండ్‌కు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. అనంతరం కార్పొరేటర్ కృష్ణ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల తీర్మానాలను మంత్రి సహకారంతో అమలు చేస్తామని చెప్పారు. సభలో పూర్వ విద్యార్థుల సమాలోచనా సమితి తరఫున డాక్టర్ శీలం పాపారావు, కత్తి నెహ్రూ, పూర్వ విద్యార్థి నాయకులు షౌకత్ అలీ, బి.గిరి, వంజాకు లక్ష్మీనారాయణ, మోత్కూరి నాగేశ్వరరావు, ఎస్‌కే పాషా, ఎం.పుల్లయ్య, ఆనంద్, అన్నపూర్ణాదేవి, అలవాల నాగేశ్వరరావు, కళాశాల లెక్చరర్ రావులపాటి సీతారాం తదితరులు మాట్లాడారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. కోఆర్డినేటర్‌గా నల్లమోతు తిరుమల్‌రావు, కోకన్వీనర్లుగా కత్తి నెహ్రూ, డాక్టర్ శీలం పాపారావు, సయ్యద్ షౌకత్‌అలీ, బి.గిరిని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బండి పార్థసారధిరెడ్డి, కొండబాల కోటేశ్వరరావు, వద్దిరాజు రవికుమార్, నామా నాగేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు, సండ్ర వెంకటవీరయ్య, మదన్‌లాల్, నల్లగట్ల స్వామిదాస్, బచ్చు విజయ్‌కుమార్, గెంటేల విద్యాసాగర్, నేదునూరి నర్సింహారావు, భాస్కర్‌రెడ్డి, జె.శ్రీనివాస్, మల్లం రమేశ్, ఎర్నేని రామారావు, పోటు రంగారావు, పోతినేని సుదర్శన్‌రావు, బాగం హేమంతరావు తదితరులను సమావేశం ప్రకటించింది.

పార్టీలు వస్తుంటాయి.. పోతుంటాయి..

రాజ్యాంగమే శాశ్వతం: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

ఖమ్మంమామిళ్లగూడెం: పార్టీలు వస్తుంటాయి.. వ్యక్తులు వస్తారు.. పోతారు.. కానీ, రాజ్యాంగం శాశ్వతమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేశ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 48 ఏళ్ల కిందట ఇందిరాగాంధీ నేతృత్వంలో దేశంలో ఎమర్జెన్సీ విధించారని, 1975 జూన్ 25న దేశం మొత్తాన్ని జైలుగా మార్చారన్నారు. అనేకులు జైలుకు వెళ్లారని, 1977లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌ను నామరూపాలు లేకుండా చేశారని గుర్తు చేశారు. ఇందిరాగాంధీ అయినా, కేసీఆర్ అయినా ప్రజాస్వామ్యం ముందు ఒకటేనని స్పష్టం చేశారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ 400 స్థానాలున్న కాంగ్రెస్ ఇప్పుడు 40 స్థానాలకు వచ్చిందన్నారు. ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్‌ను బీజేపీ మాత్రమే ఓడించగలదని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఎర్నేని రామారావు, రుద్రప్రదీప్, శ్యాంరాథోడ్, నున్నా రవికుమార్, మందా సరస్వతి, అల్లిక అంజయ్య, ఉపేందర్‌గౌడ్, సుదర్శన్, మృత్యుంజయ, దీకొండ శ్యామ్, శ్రీనివాస్, మోహన్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డి

ఎర్రజెండా అంటే పాలక పార్టీలకు భయం

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు హేమంతరావు



పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న బాగం హేమంతరావు

రఘునాథపాలెం: అవినీతిని, అన్యాయాన్ని ప్రశ్నిస్తారని, ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తారని, ప్రజల్లో చైతన్యం తీసుకొస్తారనే నెపంతో ఎర్రజెండాను చూస్తేనే అధికార పార్టీలకు భయమవుతోందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. ఆదివారం రఘునాథపాలెం మండలం పడమటితండా గ్రామ పంచాయతీలో సీపీఐ శాఖ మహాసభలను శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బాగం మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీకి మరో ఏడాదితో 100 ఏళ్లు నిండుతాయని, నాటి నుంచి నేటి వరకు అధికారం ఉన్నా లేకున్నా ప్రజల వెన్నంటే ఎర్రజెండా చేతబట్టి అండగా నిలుస్తున్నామన్నారు. కాంగ్రెస్, టీడీపీ, ప్రజారాజ్యం, ఇప్పుడు బీఆర్‌ఎస్ ఇలా చెప్పుకుంటూ పోతే ఏ పార్టీ కమ్యూనిస్టులను కదిలించలేక పోయిందని, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి వెళ్లే ఊసరవెల్లులు కమ్యూనిస్టులను విమర్శించేవారని మండిపడ్డారు. రామన్నపేట, దానవాయిగూడెం, కామంచికల్, దారేడు, పడమటితండా, జాన్బాద్‌తండా గ్రామాలు సీపీఐకి పెట్టనికోటలుగానే ఉన్నాయని తెలిపారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి, సహాయ కార్యదర్శులు పోటు ప్రసాద్, దండి సురేశ్ మాట్లాడారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని వందలాది కుటుంబాలు అధికార పార్టీ నుంచి సీపీఐలో చేరాయని ప్రకటించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మొహమ్మద్ మౌలానా, అజ్మీర రామ్మూర్తి, సిద్దినేని కర్ణకుమార్, పగిళ్ల వీరభద్రం, పుచ్చకాయల కమలాకర్, శంకరయ్య, ఓరుగంటి శేషగిరి, బోజెడ్ల సూర్యం, హనుమంతు రాము, లింగ వెంకటనారాయణ, పిట్ల కృష్ణమూర్తి, చందర్‌రావు, మోహన్‌రావు, సీతారాములు, శ్రీనాథ్‌రెడ్డి, రవికుమార్, ఉపేందర్, ముత్తయ్య, సంగయ్య, రామ్మూర్తి పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

ఏన్కూరు: మహిళపై దాడి చేసిన ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్య రాధ అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. భర్త మృతి చెందిన తరువాత ఒంటిగుడిసెలో ఉంటోంది. ఆదివారం తన పెద్దకుమారుడితో కలిసి కోనాయిపాలెం గ్రామం వచ్చింది. కాగా, ఆ గ్రామానికి చెందిన భూక్య మహేశ్ రాధ చిన్నకుమారుడిని ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని తీసుకెళ్తున్నాడు. తన కుమారుడిని ఎందుకు తీసుకెళ్తున్నావని మహేశ్‌ను రాధ అడుగగా ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరిగింది. దీంతో మహేశ్ బంధువులు నలుగురు వచ్చి రాధను దుర్భాషలాడుతూ కొట్టారు. దీంతో రాధ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ రవి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, తనను, తన భార్య ఉషారాణిని తిట్టారని ఆరోపిస్తూ మహేశ్ కూడా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి



నర్సింహారావు (ఫైల్)

ఖమ్మంసహకారనగర్/చింతకాని/కల్లూరురూరల్: స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న కె.నర్సింహారావు (57) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. కల్లూరు మండలం చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన ఆయన ప్రస్తుతం ఖమ్మం నగరం బల్లేపల్లిలోని జయనగర్‌కాలనీలో నివాసముంటున్నాడు. టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా కూడా పనిచేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతదేహాన్ని డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, డీఈఓ సోమశేఖరశర్మ, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.నాగిరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వెంకటేశ్వరరావు, ఎస్.విజయ్ చింతకాని ఎంఈఓ మోదుగు శ్యాంసన్, ఎంపీడీఓ మల్లెల రవీంద్రప్రసాద్, కల్లూరు జెడ్పీటీసీ సభ్యుడు కట్టా అజయ్‌కుమార్, సర్పంచ్ నామా రాధమ్మతోపాటు చావా వెంకటేశ్వరరావు, మనోహర్‌రాజు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, డి.శ్రీనివాసరావు, రామారావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.



కల్లూరు: నివాళులర్పిస్తున్న డీసీసీబీ చైర్మన్ నాగభూషణం

బైక్ అదుపుతప్పి వ్యక్తి...

సత్తుపల్లిటౌన్: ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో ఓ వ్యక్తి తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మండలంలోని తాళ్లమడ గ్రామానికి చెందిన కూసిని వెంకటేశ్వరరావు (40) సత్తుపల్లిలో శనివారం కూలి పనులు ముగించుకొని రాత్రి ద్విచక్రవాహనంపై తాళ్లమడ వెళ్తున్నాడు. పట్టణంలోని హనుమాన్‌నగర్ పెట్రోల్‌బంక్ వద్దకు వెళ్లే సరికి ఎదురుగా వస్తున్న వాహనం లైటింగ్ కళ్లల్లో పడటంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. అతడి తలకు బలమైన గాయాలవడంతో స్థానికులు 108లో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొని వైల్డ్‌లైఫ్ బీట్ అధికారి మృతి

కొత్తగూడెంరూరల్: ఎదురుగా ఉన్న లారీ ఢీకొనడంతో ఓ వైల్డ్‌లైఫ్ బీట్ అధికారి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. చాతకొండరేంజ్ మొట్లగూడెం బీట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న టేకులపల్లి మండలం బోరింగ్‌తండా గ్రామానికి చెందిన మోతీలాల్(48) తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈక్రమంలో లక్ష్మీదేవిపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా ఉన్న లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఏరియా ఆస్పత్రికి ఆపై ఖమ్మంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బస్సు ఢీకొని గేదెలు మృతి

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం – గొల్లపూడి గ్రామాల మధ్య ఆర్టీసీ బస్సు ఢీకొని రెండు గేదెలు మృతిచెందిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రెబ్బవరం గ్రామానికి చెందిన రైతు సీతయ్య.. తన నాలుగు గేదెలను ఇంటికి తోలుకొని పోతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి మధిర వెళ్తున్న మధిర డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందగా మరో రెండు గేదెలకు గాయాలయ్యాయి. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని సీతయ్య లబోదిబోమంటున్నాడు.

ప్రాణం తీసిన ఈత సరదా

ఇల్లెందురూరల్: పోలారం గ్రామ పంచాయతీ బొంబాయితండాలో తనుగోర్ నవీన్ (11) ఆదివారం సాయంత్రం చెరువులో ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెరువులో ఈత కొట్టి చేపలు పట్టుకుందామని ముందుస్తుగా మాట్లాడుకున్న నవీన్, అతని ఇద్దరు స్నేహితులు చెరువు వద్దకు బయలుదేరారు. సరదాగా కొద్దిసేపు ఈత కొట్టారు. ఇంతలో తమతోపాటు వచ్చిన నవీన్ కనిపించకపోవడంతో స్నేహితులు కంగారుగా ఇంటికి వచ్చారు. రాత్రి అయినా నవీన్ ఇంటికి రాకపోవడంతో తండ్రి వెంకన్న కుమారుడి ఆచూకీ కోసం అతడి స్నేహితులను అడుగగా.. జరిగిన విషయం చెప్పారు. వెంటనే వెంకన్న గ్రామస్తులతో కలిసి చెరువు వద్దకు వెళ్లి వెతకగా.. నవీన్ భౌతికకాయం కనిపించడంతో ఇంటికి చేర్చారు. గతేడాది పాముకాటుకు గురైన నవీన్‌కు రూ.2లక్షల వరకు ఖర్చు చేశారని, మూడు రోజుల క్రితమే మండలంలోని బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో చేర్పించారని గ్రామస్తులు తెలిపారు. పాఠశాలకు వెళ్లాల్సిన నవీన్ మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.



పులకరిస్తున్న 'గడప'!

- 83,83,908 గృహాలను సందర్శించిన ఏపీ ఎమ్మెల్యేలు

సాక్షి, అమరావతి: ఓట్లు దండుకుని మొహం చాటేసిన మనుషులనే ఇన్నాళ్లూ చూశాం! ఎన్నికలు ముగియగానే మేనిఫెస్టోను మాయం చేసి చెత్తబుట్ట పాలు చేసిన పార్టీల గురించే మాకు తెలుసు! అధికారం చేపట్టాక ప్రజా సమస్యలను గాలికి వదిలేసి గ్రామాల వైపు తిరిగి చూడని నేతల పాలనలో దశాబ్దాల పాటు నలిగిపోయాం! మళ్లీ ఎన్నికలు వస్తే గానీ మా గుమ్మం తొక్కని నాయకులతో విసిగిపోయాం! అలాంటిది.. చరిత్రలో తొలిసారిగా 99 శాతం హామీలను నెరవేర్చి చిరునవ్వుతో, ఆత్మవిశ్వాసంతో మా గుమ్మం వద్దకు వస్తున్న ప్రజా ప్రతినిధులను ఇప్పుడే చూస్తున్నాం..! ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? ఇంకా ఏమైనా సమస్యలున్నాయా?.. ఆశీర్వదించండంటూ ఆత్మీయంగా గడప గడపనూ పలుకరిస్తున్న నాయకులను చూడటం ఇదే మొదటిసారి అని ఏపీ ప్రజానీకం పేర్కొంటోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంతో ప్రతి గడప పులకరిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా ఈ నెల 20వతేదీ నాటికి ఎమ్మెల్యేలు 83,83,908 గృహాలను సందర్శించారు. ఆయా కుటుంబాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేకూర్చిన ప్రయోజనాలను వివరించి వారి ఆశీర్వాదాలను పొందారు. రాష్ట్రంలోని మొత్తం 15,004 గ్రామ, వార్డు సచివాలయాలకుగానూ ఇప్పటి వరకు ఎమ్మెల్యేలు 9,316 సచివాలయాలను సందర్శించారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా సచివాలయాల వారీగా పర్యటిస్తూ ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజలను కలుసుకుంటున్న ఎమ్మెల్యేలు ఆయా కుటుంబాలకు ప్రభుత్వం చేకూర్చిన మేలును వివరిస్తూ పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? అని ఆరా తీస్తూ ఆయా కుటుంబాలతో టిక్ పెట్టిస్తున్నారు. ప్రతి ఎమ్మెల్యే సచివాలయాల పరిధిలో రెండు రోజుల పాటు పర్యటించడంతో పాటు స్థానికంగా ప్రజలకు అవసరమైన, ప్రాధాన్యత కలిగిన పనులను గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరు చేస్తున్నారు. ఒక్కో సచివాలయం పరిధిలో రూ.20 లక్షల చొప్పున అత్యంత ప్రాధాన్యత పనులను గుర్తించి వెంటనే మంజూరు చేస్తున్నారు.

నిస్తేజం.. గందరగోళం!

పవన్ కళ్యాణ్ వైఖరితో జనసేన శ్రేణుల్లో అయోమయం

- వివాదాల సుడిగుండంలో వారాహి యాత్ర.. టీడీపీతో పొత్తు ప్రస్తావనతో పడిపోయిన గ్రాఫ్
- దానిని నిలబెట్టుకునే ఎత్తుగడతో బోల్తా
- సవాళ్లను స్వీకరించకుండా పలాయన మంత్రం
- అజెండా లేకుండానే ఉమ్మడి 'తూర్పు'న ముగింపు
- వ్యక్తిగత విమర్శలతో మనసకబారిన అభిమానం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: దశ, దిశ నిర్దేశం లేకుండానే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర ముగిసింది. తూర్పు సెంటిమెంట్‌గా ఈ నెల 14న అన్నవరం సత్యదేవునికి పూజలు నిర్వహించి, పవన్ ఈ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్రలో పార్టీ నిర్దిష్ట అజెండా గురించి తన నాయకుడు వివరిస్తారని భావించిన ఆయన అభిమానులకు నిరాశే ఎదురైంది. కాకినాడ జిల్లా కత్తిపూడి మొదలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో ఆదివారం జరిగిన ముగింపు సభ వరకూ వరుసగా వివాదాలు మూటగట్టుకున్నారు. సహజంగా ఏ రాజకీయ పార్టీ అయినా ఇటువంటి యాత్రలు చేసేటప్పుడు పార్టీ విధానపరమైన ప్రణాళికలను ప్రజల ముందు ఉంచుతుంది. తమకు ఓటేస్తే ప్రజలకు ఏం చేయదలుచుకున్నారో అర్థమయ్యేలా వివరిస్తూ.. వారి మనసు చూరగొనే ప్రయత్నం చేస్తుంది. పవన్ అభిమానులు, ఆ పార్టీ నేతలు ఆయన నుంచి ఇవే ఆశించారు. కానీ అందుకు పూర్తి భిన్నంగా వన్‌మేన్ ఆర్మీ మాదిరిగా ఉమ్మడి తూర్పు గోదావరిలో పవన్ తన యాత్రకు ముగింపు పలికారు. పార్టీకి ఒక అజెండా అంటూ లేకపోవడం జనసేన నేతలకు రుచించ లేదు.

ద్వారంపూడి, ముద్రగడపై విమర్శలతో పెనుదుమారం

వారాహి యాత్రలో పవన్ వ్యాఖ్యలపై పెనుదుమారం రేగింది. రెండవ సారి గెలుపొందిన కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వంటి నేతలే లక్ష్యంగా పవన్ ప్రసంగం సాగడం సొంత సామాజిక వర్గ నేతల నుంచే అసంతృప్తి వ్యక్తమైంది. అలాగే, కాపు ఉద్యమాన్ని ముందుండి నడిపించిన నేత ముద్రగడ పద్మనాభం లక్ష్యంగా పరోక్ష విమర్శలు చేయడం రాష్ట్ర స్థాయిలో పెనుదుమారాన్నే రేపింది. అటు ద్వారంపూడి, ఇటు ముద్రగడ సంధించిన అనేక ప్రశ్నలకు, వచ్చే ఎన్నికల్లో పోటీపై విసిరిన సవాళ్లకు పవన్ సమాధానం చెప్పకుండానే తోక ముడిచారనే విమర్శను మూటగట్టుకోవాల్సి వచ్చింది. గుండె ధైర్యం ఎక్కువని పదేపదే చెప్పుకునే ఆయన.. వారి సవాళ్లకు సరైన సమాధానం చెబుతారని ఎదురు చూశామని, తీరా చివరకు తల దించుకునేలా చేశారని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు. ఒక పక్క జనసేనకు కులాల అంతరాలు లేవంటూనే మరోపక్క తన ప్రసంగాల్లో కులాల ప్రస్తావనతో యువతలో పవన్ భావోద్వేగాలు రెచ్చగొట్టిన తీరును మేధావి వర్గం తప్పు పడుతోంది. పవన్ వాడిన పదజాలంపై రాజకీయాల్లో మూడు దశాబ్దాల అనుభవం ఉన్న కాకినాడ ఎంపీ వంగా గీత 'రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు ఇదేనా మీరిచ్చే సందేశం' అంటూ చురకలు అంటించడం గమనార్హం.

అయినా.. మారలేదు

రీల్ లైఫ్‌కు, రియల్ లైఫ్‌కు చాలా తేడా ఉంటుందని చెబుతూనే ప్రసంగాలు, హావభావాల్లో ఫక్తు సినిమా స్టైల్‌ను ప్రదర్శించడంలో పవన్ ఔచిత్యాన్ని విజ్ఞులు ప్రశ్నిస్తున్నారు. తాను సీఎం అయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని కత్తిపూడిలో చెప్పుకున్న పవన్.. పచ్చ మీడియా ఇంటర్వ్యూల్లో ఏదో అభిమానులు అలా అంటూంటే వారిని ఉత్సాహ పరిచేందుకు అలా మాట్లాడాననడం ఒక పార్టీకి నాయకత్వం వహించే నాయకుడి లక్షణమా అని వివిధ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. మార్పు రావాలని గొంతెత్తిన జనసేనాని తాను మారలేదనే విషయాన్ని వారాహి యాత్ర ద్వారా చెప్పకనే చెప్పారని ఆ వర్గాలు అంటున్నాయి. గోదావరి నేలను వదిలేది లేదని, ఈ జిల్లాలు రాజకీయ మార్పునకు నాంది పలుకుతాయని చెప్పిన పవన్.. వచ్చే ఎన్నికల్లో పోటీపై గత ఎన్నికల్లో మాదిరిగానే ఇప్పుడు కూడా పూటకో మాటతో అభిమానులను గందరగోళంలో పడేశారు.

ఆ పార్టీ నేతలే పెదవి విరుపు

మంగళగిరిలో తెలుగుదేశంతో పొత్తు అనగానే గోదావరి జిల్లాల్లో పవన్ గ్రాఫ్ పడిపోయింది. 80వ దశకంలో వంగవీటి మోహన్ రంగా హత్యోదంతం నుంచి.. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కుటుంబం పైన, కాపు సామాజికవర్గం పైన చంద్రబాబు ప్రభుత్వం సాగించిన దమనకాండను గుర్తుకు తెచ్చుకుని.. సామాజిక మాధ్యమాల్లో పలువురు పవన్ తీరును ఏకి పారేశారు. ఆ వ్యతిరేకతను తగ్గించుకునేందుకో లేక కాస్తో కూస్తో బలం ఉన్న గోదావరి జిల్లాల్లో బలప్రదర్శన ద్వారా పొత్తుల్లో సీట్లు పెంచుకునేందుకో వారాహి యాత్రను ఇక్కడి నుంచే ప్రారంభించి ఉంటారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ యాత్రలో తమకు కనీస ప్రాధాన్యం ఇవ్వలేదని ఆ పార్టీ నేతలు పలువురు తీవ్ర ఆవేదనతో ఉన్నారు. పుష్కర కాలంగా పార్టీ కోసం లక్షల రూపాయలు తగలేసుకుంటున్న ఇన్‌చార్జిలకు సైతం వారాహిపై వేదిక పంచుకునే అవకాశం ఇవ్వకుండా దూరం పెట్టడంపై నిప్పులు చెరుగుతున్నారు. మొత్తంగా ఉమ్మడి 'తూర్పు'న వారాహి యాత్ర అనేక వివాదాలు, అసంతృప్తులతో ఆ పార్టీ అభిమానులకు తీవ్ర నిరాశ మిగిల్చింది.

ప్రాణ రహిత!

▶ మొదటి పేజీ తరువాయి

మహాదేవ్ కొండల్లో జన్మించిన వెయిన్‌గంగా నది మహారాష్ట్రలోని వార్ధా, పెన్‌గంగా నదులను కలుపుకుంటూ తెలంగాణలో ప్రాణహిత నదిగా ప్రవేశిస్తుంది. మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులోని సిరోంచా ప్రాంతంలో ఏర్పాటు చేసిన టెక్రా గేజ్ పాయింట్ వద్ద ప్రాణహితకు వచ్చే వరద లెక్కలను కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) రికార్డు చేస్తోంది. సీడబ్ల్యూసీ నివేదికల ప్రకారం 1964–65 నుంచి ఇప్పటివరకు వర్షాకాలంలో టెక్రా గేజ్ పాయింట్ వద్ద ప్రాణహితలో అత్యల్పంగా 444 క్యూసెక్కుల వరద 2005 జూన్ 21న నమోదైంది. అత్యధికంగా 3,90,416 క్యూసెక్కుల వరద 1981 ఆగస్టు 11న రికార్డు అయింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్రతోపాటు తెలంగాణలో పరీవాహక ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావం నెలకొని ఉండటంతో ప్రస్తుత జూన్‌లో గరిష్టంగా 800 క్యూసెక్కుల వరద మాత్రమే వచ్చిందని, గత 65 ఏళ్లలో చాలా అరుదుగా ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని నీటిపారుదల శాఖ వర్గాలు చెబుతున్నాయి. గతేడాది జూన్‌లో ప్రాణహితకి 15.7 టీఎంసీల వరద రాగా ఈ ఏడాది 0.1 టీఎంసీకి మించలేదని అధికారులు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురుస్తాయని వాతావరణ శాఖ అంచనాలున్న నేపథ్యంలో జూలై, ఆగస్టు నాటికి ప్రాణహితలో వరద ప్రవాహం పెరగొచ్చని నీటిపారుదల శాఖ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

నీటిపారుదల, వ్యవసాయ శాఖల సమావేశం

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రాజెక్టుల కింద వానాకాలం సాగుకు ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖలు ఉమ్మడి సమావేశం నిర్వహించాయి. గోదావరి పరీవాహక ప్రాంతంలో ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో గోదావరితోపాటు వార్ధా, ప్రాణహిత, ఇంద్రావతి వంటి ఉపనదులు తడారిపోయాయని నీటిపారుదల శాఖ నివేదించింది. వచ్చే నెల తొలి వారంలో పరిస్థితిని పునఃసమీక్షించాలని, ఆ తర్వాతే ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు సాగునీటి సరఫరాపై నిర్ణయంతీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది.

ఐటీ కొలువులకు 'వింగ్స్'

- గ్రూప్ స్నాప్ ఫెస్ట్–2023 పేరుతో జాబ్ ఫెయిర్
- విశాఖలో 21, 22 తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు



బ్రోచర్, వెబ్‌సైట్ ఆవిష్కరిస్తున్న ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద నగరంగా విశాఖపట్నం భాసిల్లుతోంది. త్వరలో కార్యనిర్వాహక రాజధానిగా కూడా ప్రత్యేకతను సంతరించుకోనున్న విశాఖపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఐటీ హబ్‌గా నగరాన్ని అభివృద్ధి చేసేందుకు వడివడిగా అడుగులు ముందుకేస్తోంది. దీంతో దిగ్గజ సంస్థలు విశాఖ వైపు ఆసక్తి కనబరుస్తున్నాయి. దీంతో ఐటీ సంస్థల్లో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించడానికి ప్రభుత్వం నడుం బిగించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ సహకారంతో విశాఖలో జాబ్ ఫెయిర్ నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. జూలై 21, 22 తేదీల్లో గ్రూప్ స్నాప్ ఫెస్ట్–2023 పేరుతో జరిగే ఈ కార్యక్రమానికి దిగ్గజ ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు హాజరుకానున్నాయి. దీనికి సంబంధించిన బ్రోచర్, వెబ్‌సైట్‌ని విశాఖలో ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం ఆవిష్కరించారు.

త్వరలో దిగ్గజ సంస్థల కార్యకలాపాలు..

ప్రస్తుతం ఏపీలో దాదాపు 300కి పైగా ఐటీ కంపెనీలుండగా.. ఇందులో 80% వరకు విశాఖ కేంద్రంగానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 28న దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్.. డెవలప్‌మెంట్ సెంటర్‌ని ప్రారంభించనుంది. ఇదే బాటలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, విప్రో కూడా పయనించనున్నాయి. ఈ నేపథ్యంలో.. రాష్ట్రంలో ఉన్న గ్రాడ్యుయేట్స్‌కు, ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలకు మధ్య బాండింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కొత్త కాన్సెప్ట్ తీసుకొస్తోంది. ఎపిటా, రాష్ట్ర ఐటీ విభాగం సహకారంతో వి ఇన్ఫో టెక్నాలజీస్ ఆధ్వర్యంలో గ్రూప్ స్నాప్ ఫెస్ట్–2023ని నిర్వహించనుంది. ఐటీ, ఐటీ అనుబంధ రంగ కంపెనీలకే కాకుండా.. ఫార్మా సంస్థలు, స్టార్టప్ సంస్థలకు ఏ విధమైన నైపుణ్యాలున్న మానవ వనరులు అవసరం?.. ఉద్యోగావకాశాలు పొందాలంటే ఎలాంటి కోర్సు లు చేయాలి? టెక్నాలజీని ఎలా అందిపుచ్చుకోవాలి వంటి అంశాలను గ్రాడ్యుయేట్స్‌తో పాటు 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు వివరించడమే ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశం. 'స్ప్రెడ్ యువర్ వింగ్స్'అనే పేరుతో 2 రోజుల పాటు విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన యువత నుంచి సీవీలు తీసుకొని.. అక్కడే ప్రముఖ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయి. ఎంపికైనవారికి ఉద్యోగావకాశాలు కల్పించ నున్నాయి. జాబ్‌ఫెయిర్‌కు టెక్‌మహీంద్ర, టీసీ ఎస్, ఎల్అండ్‌టీ, కాన్సెంట్రిక్స్, కాండ్యుయెంట్, చెగ్, డబ్ల్యూఎన్‌ఎస్, సెయింట్, పాత్రా, ఫ్లూయెంట్‌గ్రిడ్, పల్సస్ వంటి 40 వరకూ ఐటీ, అనుబంధ కంపెనీలు, ఫైజర్, అరబిందో వంటి 10 ఫార్మా సంస్థలు, 54 యూనివర్సిటీలు, కళాశాలలతో పాటు 10 స్టార్టప్ కంపెనీలు హాజరు కానున్నాయి.



ఏపీలో టీఎస్ ఆర్టీసీ బస్సు బోల్తా

పుల్లలచెరువు: ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం మురికిమళ్ల సమీపంలో రాష్ట్ర రహదారిపై ఆదివారం తెలంగాణ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ బస్సు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి 24 మంది పెద్దలు, ఇద్దరు పిల్లలతో ప్రకాశం జిల్లా మార్కాపురానికి వస్తున్న హైదరాబాద్–1 డిపో బస్సు డ్రైవర్ ఎదురుగా వస్తున్న మోటర్ సైకిల్‌ను తప్పించే ప్రయత్నంలో సడన్ బ్రేక్ వేశారు. దీంతో అదుపు తప్పిన బస్సు రహదారికి అడ్డంగా బోల్తాపడింది. ఇద్దరు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. బస్సు డ్రైవర్ ముందు అద్దాన్ని పగులగొట్టి దానిద్వారా ప్రయాణికులను బయటకు పంపారు. ప్రయాణికులు వేర్వేరు వాహనాల్లో గమ్యస్థానాలకు వెళ్లిపోయారు.

జూలైలో తిరుమలలో విశేష ఉత్సవాలు ఇవే...

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై నెలలో విశేష ఉత్సవాల వివరాలను టీటీడీ పీఆర్‌ఓ విభాగం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. జూలై 1న శని త్రయోదశి, 3న ఆషాఢ పూర్ణిమ, వ్యాస పూజ, గురుపూర్ణిమ, 13న సర్వఏకాదశి, 15న శని త్రయోదశి, 17న శ్రీవారి ఆణివార ఆస్థానం, 22న ఆండాళ్ తిరువాడిపురం శాత్తుమొర, శ్రీవారు పురిశైవారి తోటకు వేంచేయడం, 30న నారాయణగిరిలో ఛత్రస్థాపనోత్సవం ఉంటాయని తెలిపింది. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 83,889 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీల్లో రూ.3.10 కోట్లు సమర్పించుకున్నారు.

జిల్లా వార్తలు

ఏఈ రాత పరీక్షకు 87 మంది హాజరు



పరీక్షను పర్యవేక్షిస్తున్న సింగరేణి అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఇంజనీర్ సివిల్ (ఇంటర్నల్) పోస్టులకు ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాన్ని పర్సనల్ జీఎం(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షకు 94 మందికి హాల్‌టికెట్లు పంపిణీ చేయగా 87 మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్ష పూర్తిగా మెరిట్‌పై ఆధారపడి ఉంటుందని, దళారులకు ఎలాంటి ప్రమేయం ఉండదని, వారిని నమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు. పరీక్ష ఫలితాలు ఆదివారం రాత్రి నుంచే సింగరేణి వెబ్‌సైట్‌లో, సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం వద్ద నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంటాయని వివరించారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్ శారద, వివిధ విభాగాల అధికారులు పరీక్షను పర్యవేక్షించారు.

లింగనిర్ధారణతో గిర్ జాతి దూడ జననం



లింగనిర్ధారణ ద్వారా పుట్టిన దూడతో గోపాలమిత్ర, రైతు

నేలకొండపల్లి : పశువుల్లో సెక్స్‌డ్ సార్టెడ్ సెమెన్‌తో అవసరమైన దూడను పొందేలా కృత్రిమ గర్భధారణ చేసి నాటు ఆవుకు గిర్ జాతికి చెందిన ఆవు దూడను జన్మించేలా చేశారు. నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామానికి చెందిన గోపాలమిత్ర యడవల్లి నర్సింహారావు గోకినేపల్లిలో రైతు కొమ్మినేని సుదర్శన్‌కు చెందిన ఆవుకు లింగ నిర్ధారణ చేసిన వీర్యాన్ని కృత్రిమ గర్భధారణ చేయించారు. ఈ విధానంతో రైతులు తమ పశువులకు ఆడ, లేక మగ జాతి దూడలను పొందే అవకాశం ఉందని వైరా వీర్య సేకరణ కేంద్రం ఈఓ డాక్టర్ కిషోర్ తెలిపారు. ప్రభుత్వం రూ.800 ఖర్చుతో సేకరించిన వీర్యాన్ని సబ్సిడీ ద్వారా రైతులకు రూ.250కి అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్ వైజర్ శంరయ్య పాల్గొన్నారు.

మత్తు.. వదిలితే భవిష్యత్తు..

- మత్తు పదార్థాల వినియోగంతో చిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు
- సరైన చికిత్సతోనే విముక్తి అంటున్న వైద్యులు
- నేడు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం



గంజాయిని ట్రాక్టర్ ద్వారా రవాణా చేస్తూ పట్టుబడిన నిందితులు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: మాదకద్రవ్యాలు మనిషి మానసిక స్థితిపై ప్రభావం చూపడమే కాకుండా శరీరంలోని అన్ని అవయవాలను అస్తవ్యస్తం చేస్తాయి. వాటికి బానిసలై ఒక్కసారిగా దూరమైన వారి ప్రవర్తన చాలాభిన్నంగా ఉంటుంది. వీటికి అలవాటు పడి ప్రాణాలు కోల్పోతున్న వారెందరో. ఇంతకు ముందు 25 ఏళ్ల వయస్సులో వ్యసనాలకు లోనైన వారు ఇప్పుడు పదహారేళ్లకే ఈ పదార్థాలు వాడుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. నేడు సమాజంలో ఎక్కువగా యువత మత్తుపదార్థాలకు బానిసవుతున్నది. మాదకద్రవ్యాల ఉచ్చులో పడకుండా మానవాళిని రక్షించేందుకు, మాదకద్రవ్యాల వాడకం లేని సమాజాన్ని సృష్టించేందుకు ప్రమాణం చేసే లక్ష్యంతో జూన్ 26ను అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది.

బానిస కావడానికి కారణం..

మద్యం, కల్తీకల్లు, గుడుంబా, సిగరెట్, బీడీ, గుట్కా, జర్దా, తంబాకు, గంజాయి, బంగ్, నల్లమందు, కొడైన్, పెథిడిన్, హెరాయిన్, కొకైన్ వంటివాటితోపాటు ఇంకా చాలానే మాదవ ద్రవ్యాలు మారుపేర్ల రూపంలో మార్కెట్లో అమ్ముడుపోతూనే ఉన్నాయి. మొదటిసారి మత్తు పదార్థం తీసుకున్నప్పుడు అది నాడీ మండలానికి చేరి మెదడులోని నాడీ కణాలను ఉత్తేజపరుస్తుంది. తద్వారా డోపమైన్‌అనే రసాయన పదార్థం విడుదలై మత్తుగా, హుషారుగా ఉన్నట్లుగా అనుభూతి పొందుతారు. ఈ అనుభూతి పొందే ప్రయత్నంలోనే బానిసలవుతారు. ఇందులో ప్రధానంగా యువకులే ఎక్కువగా ఉండడం విశేషం.

దుష్పరిణామాలు..

మత్తు పదార్థాలు నేరుగా మెదడుపైన, కేంద్ర నాడీ వ్యవస్థపైన ప్రభావం చూపుతాయి. వీటిని వాడుతుండే కొద్దీ శరీరంలోని ఇతర వ్యవస్థలపైనా దారుణమైన దుష్ప్రభావాలు చూపుతాయి. చివరకు అకాల మరణాలకు దారితీస్తాయి. ఊపిరితిత్తుల పనితీరు మందగిస్తుంది. రోగనిరోధక శక్తి వ్యవస్థ బాగా దెబ్బతింటుంది. శరీరం శుష్కించిపోతుంది. లివర్‌పై ఒత్తిడి ఏర్పడి, పని చేయని స్థితి ఏర్పడుతుంది. గుండె వేగంలో మార్పులు వస్తాయి. రక్తప్రసరణకు ఆటంకాలు ఏర్పడతాయి. జ్ఞాపకశక్తి క్షీణిస్తుంది. మూర్ఛ, పక్షవాతం వంటివి వస్తాయి. ఎదురుగా ఏం జరుగుతుందో అర్థం చేసుకోలేని గందరగోళం ఏర్పడుతుంది. మాదకద్రవ్యాలు సేవించడం కారణంగా అనవసరమైన గొడవలకు దారి తీయడం, ఆ మత్తులో ఎవరిని ఏం చేస్తున్నామో, ఏం అంటున్నామో తెలియకపోవడం లాంటి గందరగోళ స్థితిగతులను ఎదుర్కోవాల్సి వస్తుంది. కొంతకాలంగా జరిగిన కొన్ని సంఘటనలే దీనికి నిదర్శనం.



అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న భద్రాచలం టౌన్ సీఐ నాగరాజురెడ్డి (ఫైల్)

రవాణాలోనూ యువత పాత్ర..

కొంతకాలంగా యువత మత్తు పదార్థాల బారినపడి జీవితాలను నాశనం చేసుకుంటోంది. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు, విద్యాభ్యాసం చేస్తున్న కొందరు మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. వారు స్వస్థలాలకు వచ్చి ఇక్కడి వారికి అంటగడుతున్నారు. అరికట్టడానికి పోలీస్ శాఖ, ఎక్సైజ్‌శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నా.. పూర్తిస్థాయి ఫలితాలు రావడం లేదు. ఇటు భద్రాచలంతో పాటు జిల్లావ్యాప్తంగా గంజాయి మత్తులో చేసిన ఘటనలు చూస్తేనే అర్థం అవుతోంది. గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడుతోంది ఎక్కువ శాతం యువకులే. 2023 జనవరి నుంచి ఇప్పటి వరకు ఒక్క భద్రాచలంలోనే దాదాపు 1,300 కేజీల గంజాయిని అక్రమ రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారంటే జిల్లావ్యాప్తంగా చూస్తే దీని కంటే ఇంకా ఎక్కువే ఉండవచ్చు.

కఠిన చర్యలు తప్పవు...



ఎవరైనా మాదకద్రవ్యాలను విక్రయించినా, వాటితో పట్టుబడినా కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీస్, ఎక్సైజ్ శాఖలు సంయుక్త ఆధ్వర్యంలో దాడులు చేస్తాం. ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా ఎవరైనా మత్తు పదార్థాలను సరఫరా చేస్తే ఉపేక్షించేది లేదు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై దృష్టి సారిస్తున్నాం. ఇప్పటికే పలు ప్రాంతాలను మా సిబ్బంది, అధికారులు విస్తృతంగా తనిఖీలు చేశారు.

–పరితోష్ పంకజ్, ఏఎస్పీ భద్రాచలం

మత్తుకు దూరంగా ఉండాలి



మత్తు పదార్థాలు తీసుకోవడంతో అనేక సమస్యలు ఎదురవుతాయి. కుటుంబాల్లో కలహాలు, దంపతుల మధ్య గొడవలు వస్తాయి. జీవితంలో ఆర్థికంగా, మానసికంగా కుంగిపోయే ప్రమాదం ఉంది. మత్తుకు బానిసైన వారు మానసిక వైద్యుల పర్యవేక్షణలో చికిత్స చేయించుకోవడంతో విముక్తి పొందవచ్చు.

– డాక్టర్ రామకృష్ణ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, భద్రాచలం

క్రీడా స్ఫూర్తి చాటాలి

జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు



నిర్మాణపనులకు శంకుస్థాపన చేస్తున్న జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

పాల్వంచ/మణుగూరు రూరల్: విద్యుత్ ఉద్యోగులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని, పోటీతత్వం వ్యక్తిత్వానికి ఎంతో అవసరం అని జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు అన్నారు. మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. నూతనంగా నిర్మించిన ప్రాజెక్ట్ వసతి భవనాన్ని ప్రారంభించారు. ఉద్యోగుల రెసిడెన్షియల్ టౌన్ షిప్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సెక్యూరిటీ సిబ్బంది హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. ఆ తర్వాత బీటీపీఎస్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను, ప్లాంట్ నిర్వహణపై సీఈ బిచ్చన్నను అడిగి తెలుసుకున్నారు. శనివారం సాయంత్రం పాల్వంచ టీఆర్‌సీ టెన్నిస్ గ్రౌండ్‌లో జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సమష్టి కృషితో రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలోనే విద్యుత్ ఉత్పాదనలో తెలంగాణ రాష్ట్రం ముందంజలో నిలుస్తోందని, రాష్ట్ర ప్రభుత్వ కృషితో ఇతర రాష్ట్రాలకు విద్యుత్ సరఫరా చేసేంతగా ఎదిగిందని వివరించారు. మణుగూరులో చిన్నారులు నిర్వహించిన ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాల్వంచలో జరిగిన క్రీడా పోటీల్లో కేటీపీపీ, విద్యుత్ సౌధ, శ్రీశైలం, బీటీపీఎస్, నాగర్జున సాగర్, కేటీపీఎస్ 5,6,7 దశల క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదివారం ఉమెన్స్‌కు షటిల్, క్యారమ్స్, చెస్, టెన్నికాయిట్, టేబుల్ టెన్నిస్, పురుషులకు లాన్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జెన్‌కో డైరెక్టర్లు టీఆర్‌కే.రావు, ఎం.సచ్చిదానందం, వెంకటరాజం, ఎ.అజయ్, బి.లక్ష్మయ్య, సీఈలు పి.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస బాబు, బి.బిచ్చన్న, పి.రత్నాకర్, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎస్.లోహిత్ ఆనంద్, గేమ్స్ సెక్రటరీ వై.వెంకటేశ్వర్లు, టి.వీరస్వామి, ఇంజనీర్లు పార్వతి, రాంప్రసాద్, సూర్యనారాయణ, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



చెస్ పోటీల్లో పాల్గొన్న ఉద్యోగులు

ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలి

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి

సత్తుపల్లిటౌన్/సింగరేణి(కొత్తగూడెం): ఐసీడీఎస్ ను పరిరక్షించేందుకు ప్రభుత్వాలు బడ్జెట్‌ను పెంచి బలోపేతం చేయాలని అంగన్‌వాడీ టీచర్స్,హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలపై చేపట్టిన రాష్ట్ర జీపుజాతా ఆదివారం సత్తుపల్లి, కొత్తగూడెం పట్టణాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను పలుమార్లు కోరినా, ఆందోళన చేసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాబోయే కాలంలో దేశవ్యాప్తంగా జరిగే పోరాటాల్లో అంగన్‌వాడీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పొరుగు రాష్ట్రాల్లో అంగన్‌వాడీలకు ఇచ్చే వేతనా లు, ఇతర సౌకర్యాలు తెలంగాణలో అందడం లేదని ఆరోపించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సైతం అంగన్‌వాడీల వేతనాల్లో 60 శాతం కోత విధించిందని, సుప్రీంకోర్టు ఇచ్చిన గ్రాట్యుటీ అమలు చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయటం లేదని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు చలమాల విఠల్, ఎం.చంద్రశేఖర్, కొలికపోగు సర్వేశ్వరరావు, ఉదయ్‌శ్రీ, షకీన, నాగేంద్ర, విజయ, కమల, ఆదిలక్ష్మి, రోజా, లలిత, లక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జయలక్ష్మి